క్లుప్తంగా

ఏలేటిని కలిసిన అఖిలేశ్ జాదవ్



మహేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న అఖిలేశ్ జాదవ్

నర్సాపూర్(జి): బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని పార్టీ గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అఖిలేశ్ జాదవ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. నిర్మల్ నియోజకవర్గంలోని గిరిజన తండాల పర్యటన ప్రణాళిక గురించి మాట్లాడారు. గిరిజనుల్లో మంచి నాయకత్వం పెంపొందే దిశగా కలిసి పనిచేద్దామన్నారు.

బసవేశ్వర జయంతి వేడుకలు



జయంతిలో పాల్గొన్న నాయకులు

తానూరు: మండలంలోని ఎల్వి, మొగ్లి, జౌలా(బి) గ్రామాల్లో శనివారం బసవేశ్వర జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బసవేశ్వర చేసిన సేవలను గుర్తుచేశారు. ప్రతి ఒక్కరూ బసవేశ్వర అడుగుజాడలో నడవాలని సూచించారు. బీజేపీ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు కృష్ణ, గంగాధర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న రమాదేవి

భైంసాటౌన్: పట్టణంలోని క్లాత్‌మార్కెట్‌లో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి శనివారం ప్రారంభించారు. కౌన్సిలర్ రావుల సువర్ణ పోశెట్టి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పట్టణ అధ్యక్షుడు మల్లేశ్వర్, నాయకులు పోశెట్టి, నాగనాథ్, సాహెబ్‌రావు, తదితరులున్నారు.

ఘనంగా పరశురాముడి జయంతి



జయంతి వేడుకల్లో పాల్గొన్న యువకులు

ఖానాపూర్: పట్టణంలోని మార్కెట్ చౌరస్తాలో శనివారం పరశురాముని జయంతి వేడుకలు హిందూవాహినీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహాభారతంలో పరుశురాముడు వీరులకు గురువై ఎన్నో అస్త్రవిద్యలు బోధించాడన్నారు. స్కంధ పురాణం ప్రకారం పరుశురాముడు వైశాఖశుద్ధ తదియ నాడు జన్మించాడని, అందుకే ఆయన జయంతిని రోజున జరుపుతున్నామని అన్నారు. నాయకులు మలికిరి భీమేశ్, అన్నపెన్ని సాయి, కుంచపు తరుణ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఉత్తమంగా ఎదగాలి



విద్యార్థులతో నరేందర్‌రెడ్డి

నిర్మల్: ప్రాథమిక దశ నుంచే విద్యార్థులకు ఉత్తమవిద్యతో పాటు విలువలనూ అందించాలని, ఇందులో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల బాధ్యత ఉంటుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని అల్ఫోర్స్ స్కూల్‌లో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డేలో ఆయన పాల్గొన్నారు. పిల్లలకు ఏ రంగంలో ఆసక్తి ఉందో గుర్తించి ప్రోత్సహించాలన్నారు. ఆరోగ్యకరమైన పోటీతత్వంతో ముందుకుసాగేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రోగ్రెస్‌కార్డులు, ప్రశంసాపత్రాలు అందించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా రంజాన్



కుభీర్: ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



దిలావర్‌పూర్‌లో పండగ శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



లక్ష్మణచాంద: మునిపెల్లిలో ముస్లిం సోదరుల ప్రార్థనలు

జిల్లావ్యాప్తంగా రంజాన్ వేడుకలను ముస్లిం సోదరులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ఈద్గా, దర్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకున్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు వారికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. చిన్నాపెద్దలు మిఠాయిలు తినిపించుకున్నారు. ఇళ్లలో ప్రత్యేకంగా తయారు చేసిన సేమియాలను పంచిపెట్టారు. - సాక్షి నెట్‌వర్క్



భైంసాటౌన్: శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



సోన్: న్యూవెల్మల్‌లో



ఖానాపూర్: ఎంపీపీ మోహిదీకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న జాన్సన్‌నాయక్



లక్ష్మణచాందలో..



తానూరు మండలం కోలూరు గ్రామంలో..



కుంటాల మండలం ఓలా గ్రామంలో..



భైంసాలో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



లోకేశ్వరంలో..

అటెన్షన్ ప్లీజ్ — పిచ్చిమొక్కలు తొలగించండి



లోకేశ్వరం: మండలంలోని పాత పంచగుడిలో ఏర్పాటు చేసిన క్రీడా మైదానం పిచ్చిమొక్కలతో దర్శనమిస్తుంది. ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలతో మైదానం నిరుపయోగంగా మారింది. అధికారులు స్పందించి పిచ్చి మొక్కలు తొలగించేలా చర్యలు చేపట్టాలని క్రీడాకారులు కోరుతున్నారు.

- అధికారి: జగన్నాథ్, ఏపీవో, లోకేశ్వరం, సెల్: 94900 13836

బాధిత కుటుంబాలకు పరామర్శ



వెంకటేశ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న జాన్సన్‌నాయక్

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో భోగు నారాయణ అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని పెంబి జెడ్పీటీసీ జానుబాయి శనివారం పరామర్శించి ఆర్థికసాయాన్ని అందజేశారు. బాదనకుర్తి గ్రామంతోపాటు సుర్జాపూర్ పంచాయతీ పరిధిలోని కొత్తవాడలో గల పలు కుటుంబాలను పరామర్శించారు. ఆమె వెంట నాయకులు పుప్పాల ఉపేందర్, సాయి, స్వామి, చుక్క సురేందర్, కందుకాల కమలాకర్, అంబటి రవి తదితరులు ఉన్నారు.

- బాదనకుర్తి గ్రామంలో శనివారం పలు కుటుంబాలను బీఆర్ఎస్ నాయకుడు జాన్సన్‌నాయక్ పరామర్శించారు. గ్రామానికి చెందిన కె. వెంకటేష్ తండ్రి చిన్న భూమన్నతోపాటు మాదిశెట్టి రాజేశ్వర్ తల్లి మృతిచెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. నాయకులు పాల సంతోష్, తుప్ప నరేందర్, బండి బుచ్చాగౌడ్, చుక్క రాకేశ్, నవీన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఏఎంసీ నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న పాలకవర్గ సభ్యులు

భైంసాటౌన్: భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. పట్టణంలోని ఏఎంసీ సమావేశ మందిరంలో ఉన్నత శ్రేణి కార్యదర్శి అడెల్లు, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సమక్షంలో శనివారం నూతన పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్‌గా రాజేశ్‌బాబు, వైస్ చైర్మన్ జెకె పటేల్, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం వ్యాపారులు, నాయకులు, తదితరులు నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

కల్యాణ మండప పనులకు భూమిపూజ



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసారూరల్: మండలంలోని సిరాల గ్రామ శివాలయం సమీపంలో రూ. 40 లక్షల నిధులతో కల్యాణ మండప నిర్మాణ పనులకు ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ హయాంలో ఆలయాలు అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. దశలవారీగా సిరాల గ్రామ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. సర్పంచ్ సతీశ్, ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబు, నాయకులు విలాస్‌గాదేవార్, నాగేశ్, ఆనంద్, సందీప్, మోహన్, బాలాజీ, సదాశివ్, బాబన్న తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న వీవోఏల సమ్మె



లక్ష్మణచాంద: మోకాళ్లపై నిరసన తెలుపుతున్న వీవోఏలు



ఖానాపూర్: మోకాళ్లపై నిరసన వ్యక్తం చేస్తున్న వీవోఏలు

లక్ష్మణచాంద/కుంటాల/ముధోల్/ఖానాపూర్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన వీవోఏల నిరవధిక సమ్మె కొనసాగుతోంది. లక్ష్మణచాందలో మోకాళ్లపై నిలబడి శనివారం వినూత్నంగా తమ నిరసన వ్యక్తం చేశారు. ప్లకార్డులతో ప్రదర్శన చేపట్టారు. కుంటాలలో వారి సమ్మెకు బీఆర్ఎస్ నేతలు సంఘీభావం తెలిపారు. పార్టీ మండల కన్వీనర్ పడకంటి దత్తాద్రి, పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం, నాయకులు కొత్తపల్లి బుచ్చన్న, జీవీ.రమణారావు, వెంకటేశ్, తాటి మహేశ్వర్, బొంతల పోశెట్టి, గైని సాయినాథ్, సబ్బిడి గజేందర్, రాజు, రమేశ్, కుమ్మరి గజేందర్, శంకర్, అనిల్‌కుమార్ ఉన్నారు. ముధోల్‌లో వారి సమ్మెకు బీజేపీ ఎంపీటీసీ సభ్యుడు దేవోజీ భూమేష్ మద్దతు పలికారు. అనంతరం జమ్మూకాశ్మీర్ ఉగ్రవాద దాడుల్లో అమరులైన జవాన్లకు మౌనం పాటించారు. ఖానాపూర్‌లో వీవోఏలు మోకాళ్ల కూర్చొని నిరసన తెలిపారు. లావణ్య, గంగాధర్ ఉన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

మామడ: జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో ఉగ్రవాదుల దాడిలో అమరులైన జవాన్లకు నివాళిగా మండలంలోని పొన్కల్‌లో శనివారం గ్రామస్తులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ భూమేశ్వర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

'ప్రధానిపై విమర్శలు సరికాదు'

లోకేశ్వరం: బీఆర్ఎస్ ప్రభుత్వ అబద్ధపు మాటలను ఓటర్లు నమ్మరని బీజేపీ మండల అధ్యక్షుడు సంటీన్నోల్ల గంగాధర్ అన్నారు. మండల కేంద్రంలోని లక్ష్మీ కల్యాణమండపంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లోకేశ్వరంలో నిర్వహించిన బీఆర్ఎస్ నాయకులు ప్రధాని మోదీని విమర్శించడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీరును ఇప్పటికైనా మార్చుకోవాలన్నారు. బీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు భోజన్న, ముథోల్ అసెంబ్లీ కోకన్వీనర్ సుమన్‌కుమార్, జిల్లా కార్యదర్శి రమేశ్, నాయకులు రాజు, శ్రీనివాస్, సాయినాథ్, సందీప్, కిసాన్ పాల్గొన్నారు.

పల్లకిసేవలో ఊరేగింపు



లక్ష్మణచాంద: మండల కేంద్రంలో శ్రీ అష్ట భుజ వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకొని శనివారం రాత్రి పల్లకిసేవను నిర్వహించారు. స్వామివారిని గ్రామ ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. సర్పంచ్ ముత్యం రెడ్డి, ఆలయ కమిటీ, వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్షయ తృతీయ పండుగ



రాజూరలో కొత్త పనులకు భూమి పూజ చేస్తున్న రైతులు



భూమిపూజ చేస్తున్న మహిళలు



విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతు

లోకేశ్వరం/కుంటాల/తానూరు: జిల్లాలో శనివారం అక్షయ తృతీయ పండగను ఘనంగా జరుపుకున్నారు. హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వాధాయ వ్యవసాయ భూమిలో నూతన పనులకు శ్రీకారం చుట్టారు. కొందరు రైతులు కొత్త పనులకు శ్రీకారం చుట్టారు. కుటుంబాల్లో అంతా మేలు జరగాలని కోరుతూ కొంత బంగారాన్ని కొనుగోలు చేశారు. తానూరులోని ఫర్టిలైజర్ షాపుల్లో రైతులు విత్తనాలు కొనుగోలు చేశారు.

ప్రమాదం జరగకముందే స్పందించరూ



నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రం నుంచి చించోలి (బి) మీదుగా ఆదిలాబాద్ వైపు వెళ్లే ప్రధాన దారిలో రోడ్డుకిరువైపులా ఉన్న గుట్టపై బండరాళ్లు ఎప్పుడు పడిపోతాయోనని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో వందలాది వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. దీనికి దగ్గర్లోని హరితవనానికి సైతం ప్రజలు ఇదేమార్గంలో భయం గుప్పిట్లో ప్రయాణించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దీనికితోడు ఇటీవల ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షానికి బండరాళ్ల కింద ఉన్న మట్టి కిందకు జారి ఇప్పటికే ఒకటి, రెండు రాళ్లు రోడ్డుపై కిందకుపడ్డాయి. మరో రెండు పెద్ద రాళ్లు కిందకు జారిపడే ప్రమాదం ఉందని అంటున్నారు. ఎలాంటి ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి బండరాళ్లను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణంలో పాల్గొన్న దంపతులు

నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం శనివారం కమనీయంగా జరిగింది. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆలయంలో హోమం, పల్లకిసేవ, భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సర్పంచ్ రాంరెడ్డి, ఎంపీటీసీ మల్లేశ్, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సతీశ్, కోశాధికారి ప్రసాద్, సభ్యులు సదానందం, గిరిధర్, రవి, మహేందర్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి



మాట్లాడుతున్న గంగన్న

సోన్: బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషిచేయాలని పార్టీ మండల మాజీ అధ్యక్షుడు సరికెల గంగన్న పేర్కొన్నారు. మండలంలోని న్యూవెల్మల్, బొప్పారం గ్రామాల్లో శనివారం రాత్రి కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బీజేపీలో చేరిన తర్వాత మొదటిసారిగా ఈనెల 24న నిర్మల్‌కు వస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగా నిర్మల్‌లోని సెయింట్ థామస్ పాఠశాల నుంచి పార్టీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీకి కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. న్యూవెల్మల్ ఎంపీటీసీ నాగయ్య, నాయకులు సాయన్న, సాగర్, హరీశ్‌రెడ్డి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.